కార్మిక వర్గానికి సిఐటియు అభినందన

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసిన కార్మికవర్గానికి సిఐటియు కాకినాడ రూరల్ కమిటీ కార్యదర్శి తొట్టిపూడి రాజా, పంచాయతీ యూనియన్ నాయకులు సిహెచ్.అజయ్ కుమార్ అభినందనలు తెలిపారు. కోరమండల్ సుగర్ కర్మాగారం, ఒఎన్‌జిసి, డీప్ వాటర్ పోర్ట్, ఆయిల్ కర్మాగారాలు, తదితర కర్మాగారాల్లో సమ్మె జయప్రదం అయ్యిందని వారు తెలిపారు. అంగన్‌వాడీ, ఆశాలు, పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారని తెలిపారు. పెండింగ్ జీతాలు విషయంపై రమణయ్యపేట గ్రామపంచాయతీ కార్యదర్శిని కలిసి మే, జూన్ నెలల బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని వారు కోరారు. ఆదాయాలు ఉన్న పంచాయతీలో నిధులు లేవనే సాకుతో జీతాలు పెండింగ్ పెట్టడం సరికాదన్నారు.

అప్పులతో మధ్యాహ్న భోజనం

- నెలల తరబడి బిల్లులు పెండింగ్
- పెరిగిన ధరలతో అంగన్‌వాడీల అవస్థ
- కేంద్రాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

అంగన్‌వాడీ సిబ్బంది అవస్థల నడుమ విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం కేంద్రాల నిర్వహణపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుండడం వల్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందని పరిస్థితి ఏర్పడింది. బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండడం వల్ల అంగన్‌వాడలు ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం వండి పెట్టాలంటే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇచ్చే అరకొర బిల్లులు సరిపడక వేతనాల నుంచి సర్దవలసిన దుస్థితి ఏర్పడింది. పెరుగుతున్న నిత్యవసరాల సరుకుల ధరలతో ఇప్పుడు ఇస్తున్న మెనూ ఛార్జీలకు ఎటువంటి సంబంధం లేదని వారు వాపోతున్నారు. దానికి తోడు నెలల తరబడి గ్యాస్, కూరగాయల బిల్లులు అందడం లేదని, వండి ఎలా

పెట్టాలంటూ అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ధరల భారం

కాకినాడ జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1,986 మెయిన్, మినీ అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు, 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భవతులు ఉన్నారు. సుమారు 3,500 మంది టీచర్లు, వర్కర్లు పని చేస్తున్నారు. కొన్ని నెలలుగా బిల్లుల సక్రమంగా విడుదల చేయకపోవడంతో అంగన్వాడీలపై అదనపు భారం పడుతుంది.

కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు ప్రతి రోజూ మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉంది. ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 గ్రాముల నూనె మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తోంది. వంట తయారీ, గ్యాసు సంబంధించి ఒక్కో చిన్నారిపై రోజుకు రూ.2.25 పైసల ప్రకారం నెలలో 25 రోజుల పని దినాలకు బిల్లులు చెల్లిస్తోంది. ఈ మొత్తంతో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి. ప్రస్తుతం కూరగాయలు, నిత్యవసరాలు సరుకులు ధరలు విపరీతంగా పెరుగుతుంటే కేవలం రూ.2.25 పైసలకు పౌష్టికాహారం ఏవిధంగా అందుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సొంతంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది అయితే అప్పులు చేసి మెనూ ప్రకారం వండి పెడుతున్నామంటూ చెబుతున్నారు. పలు కేంద్రాలకు సుమారు 4 నెలలుగా గ్యాస్, కూరగాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పలు కేంద్రాలకు ఆరు నెలల నుంచి ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు మాత్రం ప్రతినెలా బిల్లులు ఎప్పటికప్పుడు విడుదల అవుతున్నాయని, గత నెల జూన్ వరకూ బిల్లులు విడుదల అయ్యాయని చెబుతున్నారు. కాగా ఆర్‌బిఐలో వెయింటింగ్ ఫర్ ఫండ్ క్లియరెన్స్ అంటూ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

పెరుగుతున్న ధరలతో కష్టంగా ఉంది

ప్రభుత్వం గ్యాస్‌కు నెలకు రూ.150 మాత్రమే ఇస్తోంది. పిల్లలు తక్కువగా ఉన్న సెంటర్లలో రెండు నెలలకు ఒక గ్యాస్ బండ, ఎక్కువగా ఉంటే నెలకు ఒక గ్యాస్ బండ వినియోగం అవుతుంది. ప్రభుత్వం ఇస్తున్న అరకొర బిల్లులతో మాపై అదనపు భారం తప్పడం లేదు. నిత్యావసరాలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. మెనూ ప్రకారం వండి పెట్టకపోతే అధికారుల నుంచి ఒత్తిడి ఎక్కువగా ఉంది.

ఇ.చంద్రావతి, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి.

నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్

మా కేంద్రం పరిధిలో 3 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రి స్కూల్ పిల్లలు 18 మంది, 3 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు 45 మంది, 9 మంది గర్భిణులు, నలుగురు బాలింతలు ఉన్నారు. నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఇస్తున్న గ్యాస్, కూరగాయల బిల్లులు ఏమాత్రం సరిపోవడం లేదు. మెనూ ప్రకారం వండి పెట్టాలంటే అప్పులు చేయాల్సి వస్తోంది.

- వాడపల్లి వీరమణి, అంగన్‌వాడీ, తమ్మవరం, కాకినాడ రూరల్.

పారిశ్రామికవేత్తలు సహకారం అందించాలి

ప్రజాశక్తి-కాకినాడ

జిల్లాలో ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ, జాతీయ ఉమెన్ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు పరిశ్రమలు సామాజిక బాధ్యత కింద తమ వంతు సహకారం అందించాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కోరారు. గురువారం కలెక్టరేట్‌లో పరిశ్రమలు, ఫ్యాక్టరీస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి జెసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుంచి 12వ తేదీ వరకు జాతీయ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్, ఆగస్టు 3 నుంచి 20వ తేదీ వరకు ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ కాకినాడలో జరగనున్నాయన్నారు. హాకీ టోర్నమెంట్‌కు 700 మంది, ఆర్మీ ర్యాలీకి రోజుకు సుమారుగా 800-1000 మంది హాజరవుతారని తెలిపారు. వీటిని జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు, అభ్యర్థులు, క్రీడాకారులకు అల్పాహారం, భోజనం ఇతర సదుపాయం కల్పించేందుకు ధన, వస్తు, ఆహార రూపాల్లో జిల్లాలోని పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యత కింద తమ వంతు సహాయం అందజేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఒ పి.త్రినాథ్, పరిశ్రమల శాఖ జిఎం సిహెచ్.గణపతి, ఎడి ఎస్.విజయ్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ శంకరరావు, పాల్గొన్నారు.

'జక్కంపూడి కుటుంబంపై దుష్ప్రచారం'

ప్రజాశక్తి-కాకినాడ

తమ కుటుంబంపై జనసేనకు చెందిన నేతలు వివిధ మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసిపి యువజన విభాగం ప్రాంతీయ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. గురువారం కాకినాడలో ఆయన విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. తమ కుటుంబంపైన తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారు ముందు వారి పార్టీ గురించి, వారి నాయకుల పరిస్థితి గురించి తెలుసుకోవాలని హితవు పలికారు. తమ కుటుంబం గురించి జనసేన పార్టీ నేతలు బెట్టింగ్ మాఫియా, భూకబ్జాలు పేకాట క్లబ్బులు నిర్వహిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. వీటిలో ఆధారాలు చూపాలని ఆయన సవాల్ చేశారు.

విధుల నుంచి తొలగించొద్దని వినతి

ప్రజాశక్తి-పిఠాపురం

పిఠాపురం డివిజన్ 1 సెక్షన్ పరిధిలో పని చేస్తున్న తమను విధుల నుంచి తొలగించవద్దని పలువురు లస్కర్లు పాడా పిడీ చైత్ర వర్షిణి, పిఠాపురం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరావును కలిసి గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా లస్కర్లు మాట్లాడుతూ ఏలేరు వయా పిఠాపురం డివిజన్-1 సెక్షన్ పిఠాపురం పరిధిలో లస్కర్ ఉద్యోగులుగా ఏడు సంవత్సరాల నుండి 11 మంది పని చేస్తున్నామన్నారు. దీనినే నమ్ముకుని తాము వేరే పనులకు వెళ్లకుండా ఇందులోనే పగలూ రాత్రీ తేడా లేకుండా చేలగట్ల చుట్టూ తిరుగుతూ రైతులకు నీరందించే పనిలో కష్టపడి పని చేసి కుటుంబాలను పోషించు కుంటున్నామన్నారు. నెలకు రూ.10500 చొప్పున సంవత్సరం అంతా పని చేసినా పది నెలలకు మాత్రమే జీతాలు చెల్లిస్తున్నారని, మిగలిన 2 నెలలు జీతాలు చెల్లించడం లేదని వాపోయారు. గత 10 నెలల నుండి ఆ జీతం కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరసా సతీష్, ముమ్మిడి సురేష్, గట్టెం సత్తిబాబు, మొగలి నాగేశ్వరావు, సామన వెంకట్రావు, కండపల్లి లోపరాజు, ఏలేటి సురేష్, మందపల్లి వివి.సత్యనారాయణ, నడిపల్లి మురళీకృష్ణ, జి.మహేష్, మంగం చిన్నబాబు పాల్గొన్నారు.

పాడా పీడికి వినతిపత్రం అందజేస్తున్న లస్కర్లు

పాఠశాలలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి -తాళ్లరేవు

తాళ్లరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ షాన్ మోహన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. బిర్యానీని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పథక నిర్వాహకులను పాఠశాలలో ఎప్పటినుంచి చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేశారు. అక్కడే ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించి అందిస్తున్న సేవలను ఆరా తీశారు. ఆయన వెంట ఎంఇఒలు ఎ.మంగాయమ్మ, ఎండుమ, పాఠశాల హెచ్ఎం వి.ప్రసాదరావు, ఉపాధ్యాయులు నామాడి అప్పారావు తదితరులు ఉన్నారు.

భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పరిధిలో అండ్ బి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలు మారుస్తుండటంతో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఇఇ ఎవిఎస్‌డిఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జల్లూరు, కోదండరామపురం, వీరాఘవపురం, మఠం సెంటర్, కొత్తూరు, నిమ్మతోట, సంపంగితోట, తాండ్ర పాపారాయుడు వీధి, గణపతినగర్, పాత్రుల వీధి, చిన్నవీధి, బళ్ల మార్కెట్, గాంధీ బొమ్మ సెంటర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న అధికారులు

వైద్య సదుపాయాలలో జిజిహెచ్ అగ్రస్థానం

ప్రజాశక్తి-కాకినాడ

నవజాత శిశువులు, చిన్న పిల్లలు వైద్య సదుపాయాలలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి ముందంజలో ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్య కుమారి పేర్కొన్నారు. పీడియాట్రిక్స్ లెక్చర్ గేలరీలో చైల్డ్ హెల్త్ డవలెప్మెంట్ గ్రూప్ సహకారంతో ఎస్‌బిఐ ఫౌండేషన్ ద్వారా వచ్చిన రూ.కోటి విలువైన రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్‌తో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరికరాలను సామాజిక సేవలో భాగంగా ఎస్‌బిఐ అందించిందని తెలిపారు. ఈ పరికరాల ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ డి.మాణిక్యాంబ, డాక్టర్ డిఎల్.విద్య, డాక్టరన్ బి.రాంబాబు, డాక్టర్ వి.విజయభాస్కర్ రావు, డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సత్వరం కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

మధ్యవర్తిత్వం ద్వారా గౌరవప్రదంగా కేసులు పరిష్కరించుకోవచ్చని పెద్దాపురం 7వ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో 'జాతీయ మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం 'వారోత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. చాలామంది ఏళ్ల తరబడి న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇటువంటివారు గౌరవప్రదంగా కేసులు పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంతో దోహదపడుతుందన్నారు. దీనికి సంబంధించి శిక్షణ పొందిన న్యాయవాదులు ఎవి.జనార్ధనం, దేవేంద్ర కుమార్ జైన్, టి.నూకరాజు, మడికి రాంబాబు, ఎ.ప్రభూజీ, ఎస్‌కె.వల్లిబాబు, ఎస్.విశాలాక్షి ఉన్నారని తెలిపారు. కుటుంబ కేసులు, ఆస్తి తగాదాలు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటారు వాహనాల కేసులు ఈ మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. వారం రోజులపాటు కమిటీ సభ్యులు ప్రజల్లో వివిధ రూపాలలో ఈ మధ్యవర్తిత్వ కేసుల పరిష్కారంపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం జూలై 1 నుంచి 90 రోజులపాటు మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ అవగాహన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి కె.దీప, దైవకృప, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎల్ దేవీరత్నకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పిఠాపురం న్యాయవాదుల మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కారం అవుతాయని 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి అన్నారు. కోర్టు ఆవరణలో గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగ రాజారావు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జడ్జి ఎం.శ్రీహరి మాట్లాడారు. కోర్టులో పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, ఎపిపి బత్తిన లక్ష్మణ దొర, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పిఠాపురంలో అవగాహన కల్పిస్తున్న అదనపు జిల్లా జడ్జి ఎం శ్రీహరి

పెద్దాపురం సదస్సులో ప్రసంగిస్తున్న జిల్లా జడ్జి చంద్రమౌళేశ్వరి

ఆదిత్య కళాశాలలో ఆక్వా దినోత్సవం

ప్రజాశక్తి-కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఫిషరీస్ అండ్ ఆక్వా కల్చర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జాతీ ఆక్వా రైతులు దినోత్సవాన్ని గురవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్ నాయుడు తెలిపారు. నీలి విప్లవ, భారతీయ జలచరాల పితామహుడు డాక్టర్ హీరాలాల్ చౌదరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ కోర్సులతో పాటు జీవశాస్త్రం, ఫిషరీస్ డిపార్ట్మెంట్లకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రమణేశ్వరి మాట్లాడుతూ చేపల పెంపకందారులు, ఆక్వా కల్చర్ పరిశ్రమ నిపుణులు ఇతర వాటాదారుల అమూల్యమైన సహకారాన్ని గుర్తించి, ప్రశంసించడానికి ప్రతి సంవత్సరం జూలై 10వ తేదీన జాతీయ చేపల రైతు దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు.

ఆక్వా దినోత్సవంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

కార్టూ'నిజం'



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మణ దొర

ఎపిపిగా బత్తిన లక్ష్మణదొర బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-పిఠాపురం

పిఠాపురం 12వ అదనపు జిల్లా కోర్టు ఎపిపిగా బత్తిన లక్ష్మణ దొర గురువారం కోర్టు ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా జడ్జి ఎం.శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ దొర మాట్లాడుతూ ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ప్రభుత్వానికి ప్రజలకు న్యాయమైన సేవలు చేసేందుకు తన శక్తి మేర కషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, పోలీసులు దొరను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగ రాజారావు, న్యాయవాదులు ఎస్ఎం.ఆలీ, ఎకెవై రెడ్డి, ముమ్మడి శ్రీను, సూరవరపు వెంకటేశ్వరరావు, ఒంటెద్దు శ్యాంప్రసాద్, కెవి.రమణ, కుంజర్ల అప్పారావు, ప్రసాద్ శర్మ, సత్యనారాయణ రాజు, గౌతు రాజా, రాజేశ్వరి పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండల కేంద్రమైన జగ్గంపేట రెండో సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బాలికల తాత్కాలిక వసతి గహాన్ని గురువారం ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. మండలంలోని రామవరం ఇందిరా యానాదుల కాలనీ వద్ద ఉన్న వసతి గహం శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కలికంగా రైతు సేవా కేంద్రాన్ని వసతి గహంగా మార్చారు. నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్, మారిశెట్టి భద్రం, ఎంపిపి అత్తులూరి నాగబాబు, ప్రత్యేకాధికారి ఎన్‌వివి.సత్యనారాయణ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వై.వాణి, ఎంపిడిఒ చంద్రశేఖర్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, హాస్టల్ వార్డెన్స్ రోజా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోదిరెడ్డి శ్రీనివాస్ టిడిపి నాయకులు వేములకొండ జోగారావు, ప్రభాకర్, నండ్ల చిరంజీవి, రాయి సాయి, పంచాయతీ సెక్రెటరీ జి.శివ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో జాబితా

ప్రజాశక్తి -కరప

రైతుల సంక్షేమానికి అమలు చేయదలచిన అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకానికి సంబంధించిన అర్హుల రైతుల జాబితా పొందిపరిచినట్టు ఎఒ ఐ.సత్య తెలిపారు. మండలంలోని ప్రతి రైతు సేవా కేంద్రాల్లో ఈ లిస్టు రైతుల జాబితా ఉందన్నారు. అర్హత ఉండి కూడా లిస్ట్‌లో పేరు లేనట్లయితే వారు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్టు తెలిపారు.

నేడు మరిడమ్మ ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం ఆధ్వర్యంలో స్థానిక మరిడమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహించనున్నట్లు ఫేస్‌బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమం ఎక్కడ నిర్వహించాలి తదితర అంశాలపై గురువారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మిని కలిసి చర్చించామన్నారు. వచ్చే ఏడాది నుండి అమ్మవారి జాతరకు వచ్చే యాత్రికులకు జాతర పొడవున నిత్య అన్నదానం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫేస్‌బుక్ బంద సభ్యులు సత్య ప్రశాంత్, అనంతపల్లి సతీష్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండబాబు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-పెద్దాపురం

జానపద, తోలుబొమ్మలాట, భజన కళాకారునిగా తోట కొండబాబు కళా రంగానికి చేసిన సేవలు ఎనలేనివని పలువురు కళాకారులు ప్రశంసించారు. ఇటీవల మృతి చెందిన కొండబాబు సంతాప సభ గురువారం పద్మనాభ కాలనీలోని ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సంతాప సభలో ప్రజానాట్యమండలి కళాకారులు మాట్లాడారు. కొండబాబుతో ప్రజానాట్యమండలికి ఉన్న అనుబంధాన్ని, కళారంగానికి ఆయన చేసిన సేవలను వివరించారు. ఆయన చిత్రపటానికి ఓలమాల నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, సీనియర్ నాయకులు దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, దారపురెడ్డి కృష్ణ, జిల్లా నాయకుడు అనపర్తి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

టెంపుల్ సిటీగా పిఠాపురం అభివృద్ధి

ప్రజాశక్తి-పిఠాపురం

పిఠాపురాన్ని టెంపుల్ సిటీగా అభివద్ధి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కషి చేస్తాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అన్నారు. గురువారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీపాద వల్లభ దేవస్థానాన్ని, పాదగయ క్షేత్రాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గండి కొండలరావు, బిక్కిన విశ్వేశ్వరరావు, తుమ్మల పద్మజ, బుర్రా కృష్ణంరాజు, దాట్ల సూర్యనారాయణరాజు, కర్రి చిట్టిబాబు, సుబ్బారావు, యనమండ్ర సూర్యనారాయణ, ఓలేటి వెంకటేశ్వరరావు పసుపులేటి సత్తిబాబు, యాళ్ల కృష్ణారావు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా శేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - పెద్దాపురం

డిప్యూటీ ఎంపిడిఒగా జివి.శేఖర్ రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంపిడిఒ డి.శ్రీలలితను కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. అనంతరం ఆయన పంచాయతీల కార్యదర్శిలతో రోజువారీ కార్యకలాపాలు, పి-4 సర్వే ద్వారా బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై సమీక్షించారు.

భోజనం కోసం విద్యార్థుల ఎదురుచూపు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ డే నేపథ్యంలో విద్యార్థులకు తినడానికి భోజనం రాలేదు. ఎంతసేపటికి భోజనం రాకపోవడంతో విద్యార్థులను ఉపాధ్యాయులు ఇంటికి పంపించేశారు. మండల వ్యాప్తంగా మరియు పట్టణంలో విద్యార్థులకు భోజనాలు ఆలస్యంగా తెచ్చారు. దీనిపై ఎంఇఒ బి.శివప్రసాద్ వివరణ కోరగా ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నుండి నివేదిక తెప్పించామని మధ్యాహ్నం భోజన నిర్వాహకులపై డిఇఒకు ఫిర్యాదు చేస్తున్నామని ఆయన తెలిపారు.

ఆలయం వద్ద మహా అన్నదానం

ప్రజాశక్తి - సామర్లకోట

గురు పౌర్ణమి ఉత్సవాలలో భాగంగా గురువారం షిరిడీ సాయిబాబా ఆలయం సమీపంలో వేలాది మందికి అన్నదానం నిర్వహించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు తరలివచ్చిన వేలాదిమంది ప్రజలకు భోజనాలు అందజేశారు. షిరిడి సాయి ఆలయాల్లో గురు పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పిఠాపురం రోడ్ లోని సాయి మందిరంలో ఆలయ ధర్మకర్త క్షత్రి శుభాన్‌సింగ్ ఆధ్వర్యంలో, స్థానిక నేలమ్మ చెరువు గట్టు వద్ద గల షిరిడి సాయి మందిరంలో క్షత్రి రాజారామ్ సింగ్ ఆధ్వర్యంలో, వేట్లపాలెం లోని బాబా ఆలయంలో జోరుగా గురుపూర్ణిమ పూజలు నిర్వహించి అన్నదానాలు చేపట్టారు. దవులూరి సుబ్బారావు, ధనాల అప్పారావు, జి.సత్యనారాయణ, డి.రాజబాబు, రాంబాబు, ఎంఎస్ఎన్.ప్రసాద్, భావన రుషి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మద్యం తరలిస్తున్న ఇద్దరిని గురువారం అరెస్ట్ చేశామని ద్రాక్షారామం ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. వివరాలు ఇవి.. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తరలిస్తున్న రొంగల చంద్రమౌళీని అన్నాయిపేట వద్ద పట్టుకొని రూ.2,736 విలువైన 12 సీసాలు పోలీసులు స్వాధీనం చేసు కున్నారు. అదేవిధంగా కర్రి సుమంత్రెడ్డిని యానాం కూడలి లో పట్టుకొని రూ.2,700 విలువైన 12 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాగల్లు

పంగిడిలో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన చాగల్లుకు చెందిన శ్రీరంగం కృష్ణారావు (59) పరిస్థితి విషమించడంతో ఆసుపత్రిలో బుధవారం మృతి చెందాడు. సైకిల్‌పై ఇందిరమ్మ కాలనీ నుంచి చాగల్లుకు వస్తుండగా పంగిడి సమీపంలో వెనుకనుంచి బైకు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో కృష్ణారావు రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు మృతుని కుమారుడు శ్రీరంగం లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎఎస్ఐ వి.శ్రీనివాసరావు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - దేవరపల్లి

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసులో నిందితులను అరెస్టు చేశామని డిఎస్‌పి దేవకుమార్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. కొంతకాలంగా మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకు పోతున్నారని తెలిపారు. వీటిపై వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం సాయంత్రం దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద అనుమానస్పదంగా తిరుగుతున్న నలుగురుతో ఉన్న ఒక ముఠాను ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం, ఇతర సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించారన్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయన్నారు. పలు నేరాల్లో అరెస్టు అయి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నట్లుగా గుర్తించామన్నారు. ఇప్పటి వరకూ ఈ ముఠా ఏలూరు, పశ్చిమగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో 115 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగిలించిందని తెలిపారు. పగలు ద్విచక్రవాహనాల్లో రెక్కీ నిర్వహించి, రాత్రి సమయాల్లో సెల్ఫ్ డ్రైవింగ్ కోసం కారు అద్దెకు తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టి అందులో రాగి వైర్లను దొంగతనం చేస్తున్నారని తెలిపారు. వారి నుంచి రూ.10 లక్షల విలువ చేసే 65 కేజీల రాగి దిమ్మలను, 116 కేజీల వైర్లు, వీటి రవాణా ఉపయోగించిన రెండు కార్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ నాగేశ్వరనాయక్, క్రైం సిఐ శ్రీధర్‌కుమార్, ఎపిఇపిడిసిఎల్ ఎఇ నారాయణఅప్పారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ పరిధిలోని చెందుర్తి జాతీయ రహదారి జంక్షన్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బుధవారం రాత్రి కలకత్తా నుంచి చెన్నయ్ వెళ్తున్న బియ్యం లోడు లారీ డ్రైవర్ రోడ్డుపక్క లారీని ఆపాడు. లారీ కింద మరమ్మతులు చేసికుని బయటకు వస్తుండగా విశాఖ నుంచి రాజమండ్రి వెళ్తున్న బొగ్గు లోడు లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తైమూర్ రెహ్మాన్ తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని వెంటనే ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

యువకుని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినకొండేపూడికి చెందిన యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, కాన్పూర్ జిల్లా తేసిల్ సికింద్రా, జలాల్‌పూర్‌కి చెందిన అంకిత కటియావ్(34) సీతానగరం నుంచి గోకవరం మధ్య ఎయిర్ టెల్ ఫైబర్ కేబుల్ లైన్లు వేయడానికి ఉపాధి నిమిత్తం వచ్చారు. చినకొండేపూడిలో ఒక మెడికల్ దుకాణంపై రూం అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గురువారం సహుద్యోగి ఫోన్ చేయగా, ఫోన్ తీయకపోవడంతో రూంకి వెళ్ళగా అక్కడ అంకిత్ కటియావ్ అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కొయ్యే పోతురాజు(32) కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పోతురాజు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి అతను రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికారు. ఎక్కడా అతని ఆచూకి తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎఎస్ఐ వై.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి శివారున నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. దీంతో జూదరులు పోలీసులను చూసి పొలాల్లోకి పారిపోయారు. అయితే వీరిని డ్రోన్ సాయంతో కనిపెట్టి పొలాల్లో దాక్కున్న జూదరులను ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు అరెస్టు చేశారు. ఈ దాడిలో 10 మంది జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.5,520 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సాహంగా మెగా పిటిఎం

మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ జిల్లావ్యాప్తంగా గురువారం పలు పాఠశాలల్లో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ పట్టణంలోని పిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పిటిఎంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మెగా పిటిఎం 2.0 కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా, వినూత్నంగా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఇంటర్ విద్యాధికారి ఐ.శారద, డిప్యూటీ డిఇఒ ఎన్.వెంకటరావు పాల్గొన్నారు. జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ హైస్కూల్లో సిటీ ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శంఖవరం సంస్కత ఉన్నత పాఠశాలలో దేవస్థానం చైర్మన్ ఐవి.రోహిత్ ఇఒ వీర్ల సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

యు.కొత్తపల్లి మూలపేట ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో పాఠశాల చైర్మన్ వైవిఎస్.సాంబమూర్తి, ఎంఇఒ, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

గొల్లప్రోలు పట్టణంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తల్లిదండ్రులకు అమ్మ పేరుతో ఒక మొక్క నాటమని మొక్కను అందజేశారు. హెచ్ఎం సిహెచ్.సూర్యప్రకాశ్ రెడ్డి, రాజ్యలక్ష్మి స్కూల్ చైర్‌పర్సన్ చేదులూరి శ్రీనివాస్, పండు శ్రీను పాల్గొన్నారు.

జగ్గంపేట గుర్రంపాలెం పంచాయితీ పరిధిలోని సగరపుపేట పాఠశాల సమావేశంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు పివి సత్యనారాయణ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్‌వివి.సత్యనారాయణ మాట్లాడారు. డిఆర్‌డిఎ పీడీ జి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, ఎంఇఒలు స్వామి, ఎంపిపి అత్తులూరి నాగబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పడాల బాలాజీ పాల్గొన్నారు.

కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశంలో ఎంఇఒ డేవిడ్, ఎన్ఆర్ఐ అన్యం శ్రీరామ్ మాట్లాడారు. ఎంపిపి మాత భారతి, తహశీల్దారు రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

సామర్లకోట బచ్చు ఫౌండేషన్ పాఠశాలలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొని మాట్లాడారు. హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, కంటే బాబు, గోలి వెంకట అప్పారావు చౌదరి, యార్లగడ్డ చిన్ని, నిమ్మకాయల కిరణ్ కుమార్, వల్లూరి దొరబాబు, ఫైన్నీ శ్రీనివాసరావు, పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సిహెచ్.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు.

పెద్దాపురం ఎంఇఒలు ఈరంకి ప్రభాకర శర్మ, విఆర్‌కె.చౌదరి, ఎంపిడిఒ డి.శ్రీలలిత, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

తాళ్లరేవు జెడ్‌పి హైస్కూల్లో ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని మాట్లాడారు. సత్య సాయి కరెస్పాండెంట్ పట్టా ఆదినారాయణ వర్మ, హెచ్ఎం నూకరాజు, ఎంపిపి రాయుడు సునీత, జెడ్‌పిటిసి సాగర్ పాల్గొన్నారు.

రౌతులపూడి శృంగవరంలో మెగా పేరెంట్స్ డేలో డిఇఒ పి.రమేష్ పాల్గొని మాట్లాడారు. గాడి కొండబాబు, హెచ్ఎం సింహాచలం పాల్గొన్నారు.

కరప మండలంలోని అన్ని పాఠశాలల్లో సమావేశాలు విజయవంతంగా నిర్వహించినట్లు ఎంఇఒలు బివి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. ఉప్పలంక పాఠశాలలో ఎంఎల్‌ఎసి పేరాబత్తుల రాజశేఖరం పాల్గొన్నారు. ఎంపిడిఒ ఎం.అనుపమ, ఎంఇఒ బివి.కృష్ణవేణి, హెచ్ఎం వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గండేపల్లి మల్లేపల్లి జెడ్‌పి పాఠశాలలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపిడిఒ కర్రి చంద్రరావు, జెడ్‌పిటిసి సభ్యులు వెంకటలక్ష్మి మంగతాయారు, పరిమి బాబు, ఎంఇఒలు కెహెచ్.నాయక్, వెంకటరెడ్డి, హెచ్ఎం అన్నపూర్ణ, పోతుల మోహన్‌రావు, అడబాల భాస్కరరావు, బలిరెడ్డి గంగరాజు, దిడ్డి వెంకట్రాజు, అడబాల ఆంజనేయులు పాల్గొన్నారు.

కాకినాడలో కలెక్టర్‌కు ఆయన చిత్రపటాన్ని అందజేస్తున్న విద్యార్థిని నవ్య దీపిక

జగ్గంపేటలో పాల్గొన్న ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

సామర్లకోటలో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

గుట్కాలు అమ్మితే చర్యలు తప్పవు

ప్రజాశక్తి -యు. కొత్తపల్లి

ఉప్పాడ కొత్తపల్లి ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కిరాణా, కిల్లి దుకాణాలలో సిగరెట్లు, గుట్కాలు అమ్మితే చర్యలు తప్పవని పిఠాపురం సిఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. గురువారం బీచ్ రోడ్‌లో మద్యం సేవించి వాహనాలు నడప రాదని తెలుపుతూ తనిఖీలు చేపట్టారు. పాఠశాల సమీపంలో పొగాకు ప్రొడక్ట్, అమ్మిన వారికి చలానాలకు విధించారు. ఆయన వెంట కొత్తపల్లి ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు

కాకినాడ సెజ్‌లో శ్రీసిటీ తరహా అభివృద్ధి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ సెజ్‌ను శ్రీసిటీ తరహాలో అభివృద్ధి చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్.మాధవ్ అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి ఎన్నో నిధులను మంజూరు చేసి అభివద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ఎనలేని సహాయం అందిస్తోందని మాధవ్ చెప్పారు. గురువారం ఆయన నగరంలో ఉన్న పలువురిని కలిసేందుకు వచ్చారు. ఈ సందర్భంగా పైడా బావన ప్రసాద్ స్వగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో బిక్కిన విశ్వేశ్వరరావు, పైడా కృష్ణమోహన్, వేటుకూరి సూర్యనారాయణరాజు, ఎనిమిరెడ్డి మాలకొండయ్య పాల్గొన్నారు.

వైసిపి నేతల అసత్య ఆరోపణలు తగవు

ప్రజాశక్తి - పెద్దాపురం

వైసిపి నాయకులపై కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని వైసిపి నాయకులు ఆరోపించడం తగదని టిడిపి నాయకులు అన్నారు. గురువారం స్థానిక సుధా కాలనీలోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు తోట రామకృష్ణ, ఎలిసెట్టి నాని, నూనె రామారావు మాట్లాడారు. వైసిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నామని వైసిపి నేత దొరబాబు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై మాత్రమే పోలీసులు కేసులు పెట్టారన్నారు.

సత్యనారాయణస్వామికి ఘన నివాళి

ప్రజాశక్తి-గండేపల్లి

స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద గురువారం ఆలయకర్త తర్లాడి సత్యనారాయణ స్వామి ఐదవ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు సత్తిబాబు దంపతులను ఘనంగా సన్మానించారు.

అన్నదానం నిర్వహణకు విరాళాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో అన్నదానం నిర్వహణకు గురువారం పెద్దాపురం వాస్తవ్యులు మలిరెడ్డి కష్టారావు, గంగ వారి కుటుంబ సభ్యులు రూ.10 వేలు, ప్రత్తిపాటి రామలింగం వారి కుటుంబ సభ్యులు రూ.10,116 అన్నదాన విరాళాలుగా అందజేశారు. వారికి ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆసాదులు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి

ప్రజాశక్తి - సామర్లకోట

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం సామర్లకోట 10వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున ఎంఎల్ఎ చినరాజప్పకు స్వాగతం పలికారు. అక్కడి సమస్యలను మహిళల్ని అడిగి ఎంఎల్ఎ చినరాజప్ప తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్ కుమార్, కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి, కాళ్ల రవీంద్రబాబు, మెండం సర్రయ్య పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షునిగా 'పైలా' బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రౌతులపూడి

రౌతులపూడి సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన పైలా పైడ్రాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పైడ్రాజు బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి టిడిపి మండల అధ్యక్షుడు తమరాల సత్య నారాయణ, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పైల సాంబశివరావు సర్పంచ్ పైల సీత, పైల నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా పైలా పైడ్రాజు మాట్లాడుతూ తనకు అధ్యక్షునిగా అవకాశం కల్పించిన ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభకు కతజ్ఞతలు తెలిపారు.

పైలా పైడ్రాజును అభినందిస్తున్న నాయకులు

ఎసిబికి చిక్కిన రాజోలు ఆర్ఐ

ప్రజాశక్తి- రాజోలు

రాజోలు తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న కె.రాంబాబును ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రాజోలు గ్రామానికి చెందిన గుబ్బల కృష్ణతులసి భర్త అగ్నిమాక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్‌గా పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందారు. ప్రభుత్వం నుంచి వచ్చే బెనిఫిట్స్ కోసం ఆమె నో ప్రాపర్టీ, నో ఎర్నింగ్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఆర్ఐ రాంబాబు నెలరోజులుగా ఆమెను తిప్పుతున్నాడు. సర్టిఫికెట్లు ఇవ్వడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో ఆమె ఎసిబి అధికారులను ఆశ్రయించింది. గురువారం బాధితురాలు నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఎసిబి డిఎస్‌పి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సిఐలు భాస్కరరావు, సతీష్, వాసుకృష్ణ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొన్నిరోజుల క్రితమే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.15 వేలు లంచం తీసుకున్నాడని, మళ్లీ నో ప్రాపర్టీ, నో ఎర్నింగ్ సర్టిఫికెట్‌లకు రూ.20 వేలు డిమాండ్ చేయడంతో విసిగి ఎసిబిని ఆశ్రయించానని బాధితురాలు కృష్ణ తులసి తెలిపింది. ఆర్ఐ రాంబాబు నాలుగు నెలల క్రితమే రామచంద్రపురం నుంచి రాజోలుకు బదిలీపై వచ్చారు. విధుల్లో చేరిన నాటి నుంచే తమకు ఫిర్యాదులు వచ్చాయని ఎసిబి డిఎస్‌పి తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

సాగులో సేంద్రియ పద్ధతులను పాటించాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సాగులో సేంద్రియ పద్ధతులను వినియోగించి ప్రకతి వ్యవసాయానికి నాంది పలకాలని ఉద్యాన శాఖ సిబ్బంది పిలుపునిచ్చారు. కొత్తలంక గ్రామంలో గురువారం బొంతు శ్రీనివాసరావు కు చెందిన పొలంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ కాశి అభిమన్యుడు ఆధ్వర్యంలో ఎపిసిఎన్ఎఫ్ సూచన మేరకు బెండ, బీర, ఆనప తదితర విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా ఎంటిఎ ఏడుకొండలు మాట్లాడుతూ ప్రకృతి సేద్యంతో జీవ వైవిధ్యం సాధించవచ్చిన న్నారు. ఈ కార్యక్రమంలో ఎల్2 కాశి అభిమన్యుడు, ఐసిఆర్‌పిఎస్ నక్కా కృష్ణవేణి, బొంతు అమ్మాజీ, పొనుగుమట్ల అశ్విని దుర్గ, శీలం పద్మ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని కాకినాడ సిటీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు మత్స్యకారులకు పిలుపునిచ్చారు. జగన్నాథపురంలోని రాష్ట్ర మత్స్య సాంకేతిక పరిజ్ఞాన సంస్థ సమావేశం హాల్లో గురువారం మత్స్య కృషివలుల దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అంజలి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్యఅతిథిగా, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ విశిష్ట అతిథిగా హాజరయ్యారు. తొలుత ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అంజలి జాతీయ మత్స్య రైతుల దినోత్సవ విశిష్టతను వివరించారు. మత్స్యకారులకు సంబంధించిన వివరాలను క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం చేస్తామన్నారు. దీని వల్ల మత్స్యకారుల డేటా తమ వద్ద ఉంటుందన్నారు. అనంతరం సిటీ ఎంఎల్ఎ కొండబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు అక్వా రైతులు ఎస్ఎస్‌విఎన్.చౌదరి, యాళ్ళ రవికుమార్, పబ్బినీడి కృష్ణ, సిహెచ్.వెంకటేశ్వరరావు, పి.వీరగణపతి, కె.రమణలను ఎంఎల్ఎ చేతుల మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు బలసాడి రంగారావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణరావు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార దినోత్సవంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండబాబు

గ్రామాల్లో విద్యుత్ సమస్యల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనూ విద్యుత్ సమస్య అనేది లేకుండా చర్యలు చేపడుతున్నామని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లిలో గురువారం ఎంఎల్ఎ ఆనందరావు మండలంలోని ఆయా గ్రామాలలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు నాయకులతో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన 56 విద్యుత్ సమస్యలపై నాయకులు ఎంఎల్ఎ ఆనందరావు కు విద్యుత్ శాఖ అధికారులకు అర్జీలను అందజేశారు. విద్యుత్ సమస్యలు అన్నింటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని ఎంఎల్ఎ ఆనందరావు తెలిపారు. ఇప్పటికే మండలంలోని ఆయా గ్రామాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు రూ.86 లక్షలతో పనులు జరుగుతున్నట్లు ఎంఎల్ఎ ఆనందరావు తెలిపారు. విద్యుత్ సమస్యలు గ్రామాల్లో ఎక్కడా తలెత్తకుండా విద్యుత్ వినియోగదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఎంఎల్ఎ ఆనందరావు ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ప్రధాన కార్యదర్శి పండు వెంకటేశ్వరరావు, మాజీ జడ్‌పిటిసి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్య వైశ్య,అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు కంకటాల రామం, లంకె భీమరాజు, ఎలక్ట్రికల్ ఇఇ,కె.రాంబాబు, డిప్యూటీ ఇఇ ఎ.అన్నవరం, ఎఇ, టి.శ్రీహరి, కూటమి నాయకులు ఆకుల సూర్యనారాయణ మూర్తి,చిక్కం సూర్య మోహన్, ఆకుల బుజ్జి, చిక్కం భీముడు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE XTH ADDITIONAL DISTRICT JUDGE CUM (MACT) AT ANAKAPALLE
M.V.O.P.608/2024

Between :
Mummana Suribabu **...Petitioner**
And
Penke Siva Prasad and others
...Respondents

NOTICE

To
Respondent-1
Penke Siva Prasad
S/o Polaraju, aged 32 years, R/o H.No.6-69, Bhavanarayana puram village, Sarpavaram Mandalam, Kakinada District.
(The Driver of the Lorry Bearing No. AP 31 TU 2989 and Owner of Said Lorry as Per C-Book)

Please Take notice that the above case posted to for your appearance on **Dt. 22-07-2025 at about 10:30 am** before the Honourable court in person or through your advocate failing which the matter will be decided exparte.

Betina Srinivas
Advocate, Sabbavaram

యానాం వార్తలు

గెలుపొందిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - యానాం

యానాం విద్యాశాఖ నిర్వహిస్తున్న ప్రాంతీయ స్థాయి ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. బాలయోగి స్టేడియంలో నిర్వహించిన పోటీలలో రీజన్సీ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించగా రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ద్వితీయ స్థానం సాధించాయి. తృతీయ స్థానంలో డాక్టర్ కెఆర్.నారాయణన్ గవర్నమెంట్ హైస్కూల్ నిలిచిందని జోనల్ గేమ్స్ కార్యదర్శి కొప్పనాతి భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా సిఇ అడలరసన్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. అనంతరం గెలుపొందిన జట్లకు సీనియర్ పిఇటి పి.సత్యనారాయణ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, మోహన్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న మిషన్ శక్తి టీమ్

కనకాలపేటలో డయేరియాపై అవగాహన

ప్రజాశక్తి - యానాం

మహిళ, శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కనకాలపేటలో డయేరియాపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అక్కడి తల్లులకు, సంరక్షకులకు పిల్లల్లో వచ్చే డయేరియా నివారణ, పరిశుభ్రత పాటించడం, ఒఆర్ఎస్, జింక్ మాత్రల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ శక్తి కోఆర్డినేటర్ రిబ్కా రోస్లిన్, ఎఎన్ఎం కృష్ణవేణి, మిషన్ శక్తి సభ్యులు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని పలు మండలాల్లోని గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు తదితర కారణాలతో సరఫరాలో శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఆశాఖ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. **కాట్రేనికోన:** నేడు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇం/తీనీర్ కె రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు చెయ్యరు, కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. చెట్లు కొమ్మలు, కొబ్బరి ఆకులు తొలగింపు, విద్యుత్తు లైన్లో మరమత్తులు వంటి పనులు చేపతారన్నారు. **రామచంద్రపురం**: శుక్రవారం ఉదయం 9 నుంఎతీ మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగునని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల నిమిత్తం 33/11 సబ్ స్టేషన చోడవరం రూరల్ ఫీడర్, మీద చోడవరం నరసారపు పేట ఓదురు యనమదల అంబికా అగ్రహారం ఏరియాలో అంతరాయం కలుగునని తెలిపారు. **కపిలేశ్వరపురం:** అంగర 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో 11 కె.వి అంగర, వల్లూరు, కు సంబంధించి కొత్త బ్రేకర్స్ ఏర్పాటు చేయడం పట్ల పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురువారం కె రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, టేకి, మాచరమట్టలు, శ్రీరామపురం, వల్లూరు, నల్లూరు, గ్రామాల్లో ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

CHANGE OF MY NAME

My Old Name is KUCHERLAPATI DEVI. My changed name is KUCHERLAPATI NAGAMANI, W/o. Kucherlapati Hemanth Kumar Varma. Since today onwards, my changed and new name is **KUCHERLAPATI NAGAMANI,** W/o. Kucherlapati Hemanth Kumar Varma.

KUCHERLAPATI NAGAMANI
D.No. 3-141, Venkatagiri Konda
Bommuru, Rajamahendravaram Rural
Cell: 79815 64799

దస్తావేజులు పడిపోయినవి

పెద్దాపురం మండలం, చినబ్రహ్మదేవం గ్రామానికి చెందిన ఆచంట సూర్యకుమారి, W/o. సూర్యనారాయణ తెలియజేయునది ఏమనగా,

నాకు చినబ్రహ్మదేవం గ్రామంలో సర్వే నెంబరు 259/1, 260/1 లో ఎ. 1.20 సెంట్లు భూమి కలదు. ఈ భూమికి సంబంధించిన 297/1995 నెంబరు గల దస్తావేజులు తీసుకుని జిరాక్స్ నిమిత్తం పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో వెడుతుండగా పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు అందజేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.

ఆచంట సూర్యకుమారి
W/o. సూర్యనారాయణ
చినబ్రహ్మదేవం, పెద్దాపురం మండలం
సెల్: 6302360700

పాస్‌పోర్ట్ పడిపోయినది

కుచ్చర్లపాటి అరుందతి, భర్త: సుబ్బ తాతంరాజు, కొత్తలంక పంచాయతీ కార్యాలయం దగ్గర ముమ్మిడివరం వాసిని. ది 09-06-2025న నేను నా పాస్‌పోర్ట్ నెం. **ఆర్ 9326902** గల పాస్‌పోర్ట్‌ను జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి ముమ్మిడివరం హై స్కూల్ సెంటర్‌కు వచ్చి చూసుకొనగా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. వెంటనే పాస్‌పోర్ట్ కోసం వెతకగా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయగలరని కోరి ప్రార్థిస్తున్నాను. అందజేసిన వారికి తగు పారితోషికం ఇవ్వబడును.

కుచ్చర్లపాటి అరుందతి
C/o. కుచ్చర్లపాటి శ్రీనివాసరాజు
కొత్తలంక పంచాయతీ దగ్గర, ముమ్మిడివరం మండలం
డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్ నెం.95505 18718